## సెంటిమెంట్ కొనసాగేనా?

### అచ్చంపేటలో గెలిచిన పార్టీదే అధికారం

- 12సార్లు ఇక్కడ గెలుపొందిన పార్టీనే ప్రభుత్వ ఏర్పాటు
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు
- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు

**అచ్చంపేట:** అచ్చంపేట నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ సెంటిమెంట్ కొనసాగుతోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోటాపోటీగా ప్రచారాలు మొదలుపెట్టాయి. స్థానికంగా ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న చర్చ ప్రారంభమైంది. అచ్చంపేట ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది.


అచ్చంపేట పట్టణ వ్యూ

### 1962లో నియోజకవర్గం ఏర్పాటు..

1307 ఫసలీలో అమ్రాబాద్ తాలూకాగా ఉండేది. 1322 ఫసలీలో అచ్చంపేటకు మార్చారు. 1952, 1957 అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ద్విసభ్య నియోజకవర్గాలతో అచ్చంపేట కలిసి ఉన్నది. 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున కె.నాగన్న ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గ పునర్విభజనలోనూ ఎస్సీలకే రిజర్వు అయింది. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూరు మండలాలు పూర్తిగా అచ్చంపేట సెగ్మెంట్‌లోకి వచ్చి చేరాయి. పదర, చారకొండ కొత్త మండలాల ఏర్పాటుతో మొత్తం 8 మండలాలుగా నియోజకవర్గం ఉంది. 1962 నుంచి ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరిగితే.. 12సార్లు ఇక్కడ గెలిచిన పార్టీయే అధికారం చేపట్టింది. 2009లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తే.. ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థి పి.రాములు గెలుపొందడంతో చరిత్రకు గండి పడింది. 2014, 2018లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీకి ఇక్కడ పట్టం కట్టడంతో సెంటిమెంట్ కొనసాగుతోంది. ఇంతవరకు హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యేలు లేక పోవడం విశేషం.

### వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యం..

అచ్చంపేట ఓటర్లు వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యమిస్తున్నారు. 1962 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీలకే ఓటర్లు పట్టం కట్టారు.6సార్లు కాంగ్రెస్, 5సార్లు టీడీపీ, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ విజయం సాధించాయి. 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన మహేంద్రనాథ్ రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.

### అత్యధిక.. అత్యల్ప మెజార్టీ



ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 46,181 ఓట్ల మెజార్టీ రాగా.. అత్యల్పంగా 2,609 ఓట్ల మెజార్టీ నమోదైంది. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన పి.రాములు 46,181 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డి.కిరణ్‌కుమార్ 2,609 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.


**1962 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు..**

| సంవత్సరం | పేరు | పార్టీ | మెజార్టీ |
|---|---|---|---|
| 1962 | కె.నాగన్న | కాంగ్రెస్ | 5,433 |
| 1967 | పి.మహేంద్రనాథ్ | కాంగ్రెస్ | 12,502 |
| 1972 | పి.మహేంద్రనాథ్ | కాంగ్రెస్ | 17,686 |
| 1978 | ఆర్ఎం మనోహర్ | కాంగ్రెస్.ఐ | 9,310 |
| 1983 | పి.మహేంద్రనాథ్ | టీడీపీ | 10,316 |
| 1985 | మహేంద్రనాథ్ | టీడీపీ | 34,445 |
| 1989 | డి.కిరణ్‌కుమార్ | కాంగ్రెస్ | 2,609 |
| 1994 | పి.రాములు | టీడీపీ | 46,181 |
| 1999 | పి.రాములు | టీడీపీ | 12,346 |
| 2004 | వంశీకృష్ణ | కాంగ్రెస్ | 20,665 |
| 2009 | పి.రాములు | టీడీపీ | 5,101 |
| 2014 | గువ్వల బాలరాజు | టీఆర్ఎస్ | 11,821 |
| 2018 | గువ్వల బాలరాజు | టీఆర్ఎస్ | 9,556 |

### ఓటర్ల వివరాలు..

| పురుషులు: | మహిళలు: | |
|---|---|---|
| 1,17,124 | 1,16,439 | |
| ఇతరులు: 2 | సర్వీస్ ఓటర్లు: 173 | మొత్తం: 2,33,738 |

పోలింగ్ కేంద్రాలు: 265




### 2018 ఎన్నికల్లో..

| | |
|---|---|
| గువ్వల బాలరాజు (టీఆర్ఎస్): 87,841 | చిక్కుడు వంశీకృష్ణ (కాంగ్రెస్): 78,285 |
| మేడిపల్లి మల్లేష్ (బీజేపీ): 3,196 | నోటా: 2,403 |

### భౌగోళికంగా..

అచ్చంపేట నియోజకవర్గం జిల్లాలోనే చాలా పెద్దది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఇందులో 2166.37 చదరపు కి.మీ. అభయారణ్యం, 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఏర్పాటు చేశారు. ప్రసిద్ధి చెందిన ఆలయాలు, అరుదైన వన్య ప్రాణులు, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు, సహజ వనరులు ఇక్కడ ఉన్నాయి.

**బీసీలు, ఎస్సీలే కీలకం..**

నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. కులాల వారీగా పరిశీలిస్తే.. 2,33,565 మంది ఓటర్లలో ప్రధాన సామాజిక వర్గాలైన ఎస్సీలు 60వేలు, బీసీలు లక్ష 15వేలు, ఎస్టీలు 32వేలు, రెడ్డి, వైశ్యులు 20వేలు, ముస్లిం, మైనార్టీలు 7వేల మంది ఓటర్లు ఉన్నారు.

### స్థానికేతరులకే పట్టం..


పుట్టపాగ మహేంద్రనాథ్

అచ్చంపేట నియోజకవర్గానికి మరో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ఎక్కువగా స్థానికేతరులే ఉన్నారు. మొత్తం 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. 10సార్లు స్థానికేతరులు ఎన్నిక కావడం విశేషం. 1994, 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే స్థానికులైన పి.రాములు, చిక్కుడు వంశీకృష్ణలు ఎన్నికయ్యారు. 1962లో కె.నాగయ్య, 1978లో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎం మనోహర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967, 1972, 1983, 1985 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగడకు చెందిన పుట్టపాగ మహేంద్రనాథ్ ఎన్నిక కాగా, 1989లో నాగర్‌కర్నూల్ మండలం శాయిన్‌పేటకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో అచ్చంపేట సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే పి.రాములు స్వగ్రామమైన గుండూరు.. కల్వకుర్తి నియోజకవర్గంలోకి చేరడంతో ఆయన స్థానికేతరుడు అయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన గువ్వల బాలరాజుది వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొల్కెపహాడ్ గ్రామం.

### 2009లో అప్పాపూర్‌లో పోలింగ్ బూత్..

నల్లమల అభయారణ్యంలోని అప్పాపూర్ చెంచుపెంటలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో 180/182ను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో 12 చెంచుపెంటలకు చెందిన గిరిజనులు మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

## క్లుప్తంగా

### మహిళల రక్షణ అందరి బాధ్యత



**మదనాపురం:** మహిళలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మహిళ సాధికారిక కేంద్రం వనపర్తి డీడబ్ల్యూ శ్రీవాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళల హక్కులను కాపాడాలన్నారు. మహిళలకు ప్రమాదం సంభవిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 181, 1098, 14567, 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

### ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తాం

**ఆత్మకూర్:** ఎన్నికల ప్రచారంలో భాగంగా మక్తల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పరిపాలన విభాగం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. ముఖ్యమంత్రి ప్రకటనతో సభా స్థలంలో ఉన్న ఆత్మకూర్ నాయకులు ఈలలు, చప్పట్లతో ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, విండో అధ్యక్షులు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్ తదితరులు హర్షం ప్రకటించారు.

### అకాల వర్షంతో రైతుల అగచాట్లు



**పాన్‌గల్:** కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుండటంతో కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం అకాల వర్షం పడడంతో కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి ధాన్యంపై కవర్లు కప్పడం, వర్షపు నీరు ధాన్యంలోకి రాకుండా చూసుకోవడం టార్పాలిన్ కవర్లు కప్పారు. అకాల వర్షంతో కేంద్రాల్లో ఉన్న ధాన్యంతో పాటు కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంటలకు కూడా నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరించాలని రైతులు కోరుతున్నారు.

### అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలి

**వనపర్తి టౌన్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న జూనియర్ కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జ్ కేదారనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో డీఐఈఓ జాకీర్ హుస్సేన్‌కు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పేద, మధ్య తరగతి విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ, ఫీజులు చెల్లించని విద్యార్థులను తోటి విద్యార్థుల ముందే అవమానిస్తూ మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉంటేనే విద్యలో రాణించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాంత్, మాణి, పరశురాములు, నవీన్ పాల్గొన్నారు.

### మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేయాలి

**వీపనగండ్ల:** నియోజకవర్గ కేంద్రమైన కొల్లాపూర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆత్మగౌరవ సమావేశానికి మండల కేంద్రం నుంచి పలువురు మత్స్యకారులు బయలుదేరి వెళ్లారు. స్వాతంత్ర్య ఫలాలు బలహీన వర్గాలకు అందినప్పుడే సమాజంలోని ప్రజలందరూ సమానంగా జీవించగలుగుతారని మాజీ సర్పంచ్ మత్స్య కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య అన్నారు. కార్యక్రమంలో జానకీరాముడు, సంగనమోని భానుప్రకాశ్, శేఖర్, పలువురు గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

**ఆత్మకూర్:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలికల రాష్ట్రస్థాయి జట్టుకు ఆత్మకూర్ విద్యార్థులు సమీన, అనూష ఎంపికయ్యారని కోచ్ ఖాదర్ తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ఎంపికల్లో ఆత్మకూర్ విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించనున్న అండర్–19 రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా సమీన, అనూషను పలువురుఅభినందించారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**పెంట్లవెల్లి:** బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు ఆధ్వర్యంలో దాదాపు 80 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజేష్, మతీన్, శేషు పాల్గొన్నారు.

**కొల్లాపూర్:** పట్టణంలోని పలు వార్డులకు చెందిన నాయకులు, మొలచింతలపల్లి, కుడికిళ్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తల్లి బీరం బిచ్చమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**పాన్‌గల్:** మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, మాధరావుపల్లి, మాందాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీలు మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, కమలేశ్వర్‌రావు, సోమ్‌నాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు, అభిలాష్‌రావు పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ విజయం అందించండి

**సాక్షి, నెట్‌వర్క్:** జిల్లా కేంద్రంలోని 25, 26 మున్సిపల్ వార్డుల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే మంత్రి నిరంజన్‌రెడ్డికి మద్దతుగా పెద్దమందడి మండల కేంద్రంలో వంగూర్ ప్రమోద్‌రెడ్డి, ఖిల్లాఘనపురం మండలంలోని కోతులకుంట తండాలో ఆయన కుమార్తె డాక్టర్ ప్రత్యూష, గోపాల్‌పేట మండలంలోని పొలికెపాడు గ్రామంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి, కుమార్తె తేజుశ్రీ, వనపర్తి మండలంలోని దత్తాయిపల్లిలో సింగిరెడ్డి వాసంతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సామ్యానాయక్, భార్గవి, ఎంపీపీ సంధ్య, సర్పంచ్‌లు శ్రీనునాయక్, రజని, భాగ్యలక్ష్మి, వెంకటస్వామి, బాలీశ్వర్‌రెడ్డి, రాళ్ల కృష్ణయ్య, మాణిక్యం, పురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**మక్తల్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు**

**అమరచింత:** మక్తల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సమావేశంలో పాల్గొనేందుకు మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నె, కిష్టంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విక్టరీ ఖాయమన్నారు.

**మదనాపురం:** దేవరకద్ర పట్టణంలో నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాద సభకు మండలంలోని అజ్జకొల్లు, తిర్మలాయపల్లి, దంతనూర్, మదనాపురం, దుప్పల్లి, కొన్నూరు, నర్సింగాపురం, నెలివిడి ప్రజలు తరలివెళ్లారు.

## బీజేపీ గూటికి బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు



**కొల్లాపూర్:** బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బురుగుల మునిస్వామి సోమవారం పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో చేరారు. చిన్నమల్లయ్య, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

**పెద్దకొత్తపల్లి:** నక్కలపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన చింతకుంట రాజయ్య, సాములు, శ్రీశైలం గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు సమక్షంలో చేరారు. కార్యక్రమంలో జలాల్‌శివుడు, బీమేష్, తిరుమల్, శేకర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేష్, సతీష్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో హాస్టల్ ఉద్యోగి మృతి

**గోపాల్‌పేట:** అనారోగ్యంతో రేవల్లి ఎస్సీ గురుకుల హాస్టల్‌లో పనిచేసే ఉద్యోగి సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కేతేపల్లికి చెందిన శ్రీనివాసులు (45) వీఆర్ఏ పోస్టు నుంచి ఆగస్టులో రేవల్లి ఎస్సీ హాస్టల్‌లో వంట మాస్టర్‌కు హెల్పర్‌గా నియమించారు. ఆయన రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం పదకొండు గంటల సమయంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిన తర్వాత హాస్టల్‌లోనే పడుకున్నాడు. పన్నెండు గంటలకు పక్కనున్నవారు అతడిని లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. వెంటనే అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మరణించాడని ధృవీకరించాడు. ఆ తర్వాత అతడికి టెస్టులు చేయగా టీబీ ఉందని డాక్టర్లు చెప్పినట్లు సమాచారం. శ్రీనివాసులుకు భార్య అంజనమ్మతో పాటు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## సంక్షేమం అందరికీ అందిస్తాం

**ఆత్మకూర్:** పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, ఆనంద్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కొండపురంరాము, ఉదయ్, శేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

**అమరచింత:** పట్టణంలోని ఆయా వార్డుల్లో మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలేందర్‌రెడ్డిని గెలిపించాలంటూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల నాయకుడు దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో మాసన్న, శ్రీనివాసులు, భరత్ పాల్గొన్నారు.



## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


భగవద్గీత ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

**పాన్‌గల్:** మండలంలోని దావాజిపల్లిలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, సాంద్ర సింధు వేదం వివరణ తెల్పడం జరిగిందన్నారు. దేవుడు సృష్టి ఆదిలో ఆకాశం యొక్క మేఘాల శబ్దం ద్వారా దైవ జ్ఞానం తెలియస్తుందన్నారు. అదే జ్ఞానాన్ని దేవుడు శ్రీకృష్ణుడిగా పుట్టి ద్వాపర యుగంలో భగవద్గీతగా తెలియజేశాడని, అటువంటి ముఖ్యమైన జ్ఞానంలో ముగ్గురు పురుషుల యొక్క వివరం పురుషోత్తమ ప్రాప్తి యోగం 16, 17 శ్లోకాల్లో ఉందని, దాని ఆధారంగానే శాస్త్రబద్ధంగా 'త్రైత సిద్ధాంతం భగవద్గీత' యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సేవాసమితి కమిటీ సభ్యులు నాగరత్నం, కృష్ణయ్య, సురేష్, శ్రీనివాసురెడ్డి, ఉజార్, శివమ్మ, లక్ష్మి, మన్నెం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 'రుణమాఫీ'కి మినహాయింపు ఇవ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

**వీపనగండ్ల:** అన్నదాతలకు ఉపయోగంగా ఉండే రుణమాఫీ డబ్బులు రైతు ఖాతాలో వేసేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులు రుణమాఫీ డబ్బుల కోసం ఏళ్లుగా ఎదురుచూశారని, ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల డబ్బులు విడుదల కావడం లేదని అధికారులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం అధికారులు స్పందించి రుణమాఫీ డబ్బుల విడుదలకు అనుమతి ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే కొందరు రైతులు బతికుండగానే మరణించినట్లు రికార్డులో నమోదు కావడం వల్ల వారికి డబ్బులు అందడం లేదని, వ్యవసాయాధికారులు రికార్డులను సరిచేసి అర్హులైన రైతులకు రుణమాఫీ డబ్బులు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశన్న, బత్తుల రాముడు, వెంకటేశ్వర్ల గౌడ్, నర్సింహా, నవీన్, సత్తి, ఈశ్వరయ్య, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీసీగర్జన సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న శ్రీశైలం

**ఖిల్లాఘనపురం:** హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించే బీసీ గర్జన సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి, మండల ఇన్‌చార్జు శ్రీశైలం అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మండల కేంద్రంలో పార్టీ కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తారని, ఇప్పటికే అధినాయకత్వం ప్రకటించిందన్నారు. బీసీలను ఐక్యం చేసేందుకు బీసీ గర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా బుధవారం వనపర్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అశ్వద్ధామరెడ్డి నామినేషన్ వేస్తారని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి అశ్విని కుమార్ చౌబే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎన్నికల కమిటీ చైర్మన్ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, బుచ్చిబాబుగౌడు, ఆశన్న, అంజనేయులు, శివశంకర్, ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హక్కులు కాపాడాలి


మాట్లాడుతున్న అంజనేయులు

**మదనాపురం:** ప్రభుత్వాలు దళితుల హక్కులను కాపాడాలని, రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత ప్రజలందరిపై ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, రాజ్యాంగ సవరణలు ఆపాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, దళిత వ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. దళితులు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు అనంతరం 500 మంది ప్రజల సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, సీపీఎం మండల కార్యదర్శి వెంట్రాములు, చెన్నయ్య, వెంకటేష్, సీఐటీయూ నాయకులు విష్ణు, సత్యం, లక్ష్మన్న, తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిరంజీవి, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

**పాన్‌గల్:** ఎస్సీ వర్గీకరణ బిల్లును శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఈనెల 11వ తేదీన సికింద్రాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభ పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వంగలి నాగరాజు, గంధం లక్ష్మయ్య, అన్నారంతండా సర్పంచ్ రంగానాయక్, రాములుయాదవ్, దశరథం, రామస్వామి, రాములు, బలరాం పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్:** మందకృష్ణ మాదిగ ఈనెల 11న విశ్వరూప మహాసభ ఏర్పాటు చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో విశ్వరూప మహాసభపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గంధం గట్టయ్య, తగువుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు రూరల్:** బైండ్ల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోమవారం చలో హైదారాబాద్ మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాసమోని బాలరాజు, గోపిరామకృష్ణ, బాలపీరు, స్వామి, రాజు, మహేష్, శివ, సాయికుమార్ పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మామిడిమాడ గ్రామంలోని కర్రెమ్మ గుడి వద్ద మాదిగ విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు.

## పాలస్తీనాపై దాడులు ఆపాలి

**పెబ్బేరు రూరల్:** వనపర్తి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ, పాలస్తీనాకు సంఘీభావంగా సోమవారం పట్టణ కేంద్రంలోని కర్రెమ్మ గుడి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, సీపీఎం పట్టణ కార్యదర్శి కురుమయ్య మాట్లాడుతూ అమెరికా అండతో అక్టోబర్ 7 నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధకాండ వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మదన్, పరమేశ్వరాచారి, గట్టయ్య, బాలస్వామి, రాములు, కవిత, శ్రీను, కురుమయ్య, బాలపీరు, చందు తదితరులు పాల్గొన్నారు.

## నూతన యువజన సంఘం ఏర్పాటు

**ఖిల్లాఘనపురం:** మండలంలోని సల్కెలాపురంలో సోమవారం గ్రామ యువకులంతా కలిసి నూతనంగా చైతన్య భారతి యువజన సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘానికి అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా శివరాం, కార్యదర్శిగా రాము, సంయుక్త కార్యదర్శిగా రాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక నుంచి యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో సేవాకార్యక్రమాలు చేపట్టడంతో పాటుగా యువతను క్రీడల్లో ప్రతిభ కనబరిచేలా పోటీలు, గ్రామాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని అధ్యక్షుడు వెంకటేష్ చెప్పారు. నూతన యువజన సంఘం కార్యవర్గానికి గ్రామ పెద్దలు, యువకులు శుభాకాంక్షలు తెలిపారు.